# రంగయ్యతాతమీద తిరుగుబాటు

రంగయ్య తాత కరవైయేళ్ళు దాటినై. కాని గట్టిగా ముప్ఫై మంది ప్రాణుల పిలకలా ముసలాడి చేతిలో ఉన్నై. అందరమూ ఆ ముసలాడి చావు కోసం చూస్తున్నాంగాని మొండిఘటం ఇంకా కొందర్ని చంపిగాని చావదు.

ఇప్పటి కారుగుర్ని పొట్టన పెట్టుకున్నాడు.... ఏవోలే, చచ్చినవాళ్ళే ధన్యులనిపిస్తున్నది.

మా కుర్రకారు వాళ్ళను వొదిలెయ్యండి. మా ముందుతరం వాళ్ళు చూసుకున్నా డజనుమంది ఉన్నారు గదా. ముసలాడికి జుట్టు నప్పగించి కూచున్నారు గాని ఏమీ చెయ్యలేక పోయినారే! నాకది ఆశ్చర్యంగా ఉంటుంది.

ఆ కథంతా తలుచుకుంటే ఓ నాటకం.

మా రంగయ తాతావాళ్ళు ముగ్గురన్నదమ్ములూ, ఇద్దరప్పచెల్లెళ్ళూనూ. మా ముత్తాత ఇరవై ఆరు శాస్త్రాలు చదివిన పండితుడూ, అగ్రహారీకుడూనూ. కాస్తా, కూస్తా నాలుగొందల ఎకరాల ఆస్తి. ఆ మహా విద్వాంసుడు సంవత్సరానికొక ధోవతుల చాపుకంటె మరేమీ కోరలేదు. ఆస్తి యావత్తూ సంసార్లకిచ్చి వాళ్ళేమిస్తే అదే పుచ్చుకున్నాడు.

"ఆహా! ఎంత ఉదార హృదయుడు!" అన్నారు లోకులు.

కాని ఆ ఉదార హృదయుడు చచ్చిపోతూ తన ఆస్తికి మూడో కొడుకయిన రంగయ్యను కాపలాపెట్టి మరీ చచ్చాడు. అప్పటికే రంగయ్య కర్కోటకుడనేది అగ్రహారమంతటా పాకిపోయింది. అది తెలిసే ముసలాడా పనిచేసి ఉండాలి.

రంగయ్య తన ఇద్దరన్నల్నీ ఏలాడు. పొలాలన్నీ తనే స్వయంగా మక్తాల కిచ్చి రైతుల్ని దిగ్బంధం చేశాడు. చెల్లెళ్ళని అల్లుళ్ళకిచ్చి వాళ్ళని తెచ్చి తన ఇంటే ఇల్లరికం ఉంచి వాళ్ళ ఆస్తులు కాస్తో కూస్తో ఉంటే అమ్మించి ఆ పైకం తన దగ్గిరే జాగర్త చేశాడు. బావమరుదులకి చేతినిండా పనికల్పించి వాళ్ళకి వేరే సొంత సంపాదనలు లేకుండా చేశాడు. ఎవరికి కానీ కావలిసినా రంగయ్యకు తెలియవలిసిందే - రంగయ్య ఆమోదంతోగాని ఆ కానీ రాదు.

ఆటే లాయర్లతో మాట్లాడివస్తూ డబ్బు వడ్డీలకిచ్చి అణాబిళ్ళల మీద లోకుల చేత

సంతకాలు పెట్టిస్తూ ఉండటం చేత రంగయ్య పెద్ద వ్యవహర్త అనే పేరుండేది. లా ప్రకారం ఏది ఏమిటో రంగయ్యగారు చెప్పిందానికి తిరుగులేదు.

మా నాన్నల హయాంలో కొద్ది కలతలు బయల్దేరినై. కాని రంగయ్య తాత సణిగిన వాళ్ళతో, 'నా దగ్గర లెఖ్ఖలన్నీ ఉన్నై. నాకు సెక్షన్లన్నీ తెలుసు!' అని అదరగొట్టుతూ ఉండేవాడు.

మా పెద్దల తరంలో సొంత సంపాదన లేర్పడినై. కాని ఎవరి మటుకువారు తమ దగ్గిరే ఎక్కువ డబ్బుందనీ, ఆ సంగతి మిగిలిన వాళ్ళకి తెలిస్తే దిష్టి తగులుతుందనీ, ఓరికి తెలియకుండా ఓరు సంపాదనలు తీసుకుపోయి రంగయ్యతాత దగ్గిర దాచారు!

రంగయ్యతాత అందరి రోగాలూ కుదిర్చాడు. మా నాన్నల తరం వాళ్ళకి ఒక్కళ్ళకీ ఒక మంచికొంప లేదు. అందులో నలుగురు వైద్యసహాయం లేకచచ్చారు.

"చావనీ. చచ్చేవాళ్ళకి మందుఖర్చుకూడా దేనికీ?" అన్నారు.

ఆ తరంలోనే ఇద్దరాడవాళ్ళు కూడా చచ్చారు. ఒకతె మనోవ్యాధితో చచ్చింది. మరొకతె నూతిలో దూకింది.

విచిత్రమేమిటంటే మా రంగయ్య తాత పరిపాలన కింద ఒక్క అనుకూల దాంపత్యం లేదు. ఒక్క ఆడదానికి తగిన మొగుడుగాని, ఒక్క మగవాడికి తగిన పెళ్ళాంగాని రాలేదు.

ఇక మాతరం వచ్చింది. మా తరం వాళ్ళలో ఇద్దరు లేచిపోయి అడుక్కు తింటున్నారు. ఒకడు తబలా వాయించుకు బతుకుతున్నాడు.

మేం తనమీద తిరుగుబాటు చెయ్యటానికి ప్రయత్నిస్తున్నట్టు పసికట్టి మాలో ఇద్దరు ముగ్గుర్ని రంగయ్యతాత చీలదీశాడు. వాళ్ళు అయిదు రూపాయలకీ పది రూపాయలకీ మమ్మల్ని రంగయ్య తాతకి అమ్మేశారు.

మా చదువులు రంగయ్య తాత చేతిలో ఉన్నై. మా తల్లులకి రంగయ్య తాతంటే హడలు. రంగయ్య తాతమీద తిరుగుబాటు చెయ్యటమంటే మాకు గృహ విచ్ఛిత్తితో సమానమైన విషయం.

ఒక్క ముసలాడి చేతిలో మా ఇంతమంది ప్రాణాలూ ఉండటం తలుచుకుంటే ఏడుపొచ్చేది.

ముసలాడు చస్తాడు. మనం అందాకా కనిపెట్టుకుని ఉందామనుకుందాం. కాని ఈ లోపుగా మా పుణ్యకాలం వెళ్ళిపోతున్నది.

లాటరీవేసి ఎవరమో ఒకరం ముసలాణ్ణి హత్యచేసి ఉరి పడదామనుకున్నాం. కాని అది సాగలేదు. లాటరీ వేశాం కూడానూ. కాని లాటరీలో బయటపడ్డవాళ్ళకీ గుండె చాలలేదు.

రంగయ్య తాత బస్తీలో ఎన్ని మేడలు కొన్నాడో, ఎన్ని వందల ఎకరాలు కొన్నాడో మా కెవ్వరికీ తెలీదు. అందులో మాకెవరి కెంత హక్కున్నదో మాకు తెలీదు. మా ముత్తాత తన ఆస్తినంతా రంగయ్య కిచ్చిపోయినట్టు ఊళ్ళో పుకారు. దాని విషయం కాగితాలే మున్నదీ లేనిదీ రంగయ్య తాతకే తెలియాలి. ఇప్పుడు రంగయ్య తాలూకు ఆస్తిలో చాలా భాగం ఆయన స్వార్జితం కిందికి వస్తుంది. అది రంగయ్య ఏం చేస్తాడో ఎవరికీ తెలీదు. రంగయ్య సంతతి వాళ్ళకి, ఎప్పటికన్నా ఈ ఆస్తి మనదే కదా అన్న ధైర్యం ఉండి వాళ్ళు మా మిగిలిన వాళ్ళతో కలవకుండా ఉన్నారు.

అటువంటి ఆశలు లేనివాళ్ళం విడిపడదామా అంటే మా తండ్రుల ఆర్జనల తాలూకు డబ్బు రంగయ్య తాత దగ్గిర ఉంది; మంచిగా కాలం వెళ్ళబుచ్చితే చచ్చే లోపుగా మాకందరికి ఆ డబ్బు వడ్డీతో సహా పంచి ఇచ్చి ఆశ్చర్యకరమైన పనిచేస్తాడేమోననే ఆశ కొందరికైనా ఉంది.

ఆఖరుకు మావాడొకడు బహిరంగంగా ప్రకటన చేశాడు:

'అబ్బాయిలూ, ఇది కేవలమూ డబ్బు సమస్య కాదు. నే నీ క్షణాన భౌతిక సిద్ధాంతాల కన్నిటికీ తిలోదకాల నిచ్చేస్తున్నాను. ఇప్పుడు ముఖ్యమైంది మన స్వాతంత్ర్యం; రంగయ్య తాత నించి విముక్తి. అడుక్కుతింటాం. కట్టెలు కొట్టుకుంటాం. కాని మన పెళ్ళాల్ని రంగయ్యతాత నిర్ణయించాడు. మన యిష్టమొచ్చిన వాళ్ళని పెళ్ళాడి వాళ్ళతో ప్రేమగా కాపరం చేతాం. పుల్లీళ్ళయినా స్వతంత్రంగా తాగుదాం. ప్రపంచంలో మంచితనమూ, మానవత్వమూ ఉంది; దాని తాలూకు గాలి పీల్చుకుందాం. ఈ పని అదివరకే మన వాళ్ళు కొందరు చేశారు. మనం కూడా ఆ పనే కలిసికట్టుగా చేద్దాం!" అన్నాడు.

ఆ ప్రకటన మాకు నచ్చింది. పూర్తిగా పదిమంది బయటికొచ్చేశాం. తిండికి లేకపోవటం, ఎండవానలకు తడవటమూ కూడా అనుభవించాం. కాని మా ఆత్మలకు విముక్తి కలిగింది. ఈ ఆనందం రంగయ్యతాత ఆస్తి పంచుకునే వాళ్ళ కెప్పటికి రాను? సంఘుభావమా? మా పదిమందిమధ్యా ఉన్నదాన్లో నూరోవంతయినా రంగయ్య తాత కింది వాళ్ళెరుగుదురా? పదిమందిమి! భౌతికంగా మటుకేం సాధించలేం గనక?

***మొదటి ముద్రణ : ఆనందవాణి, 24 సెప్టెంబర్ 1944***